వంటింట్లో పాప కుతూహలంగా నిలుచున్నాను, అంతలో మాటల్ని సంభాషణ వినిపిస్తోంది. పాప వాళ్ళ నాన్నగారిని అడుగుతూంది: "నాన్నా! నీకు నేనంటే ఇష్టమా? అమ్మంటే ఇష్టమా?" ఒక్కసారి వెనక్కు తిరిగి శ్రీవారి ముఖం చూడబోయాను. అమృతం తాగినట్టు ముఖం పెట్టి, "ఇద్దరూనూ" అన్నారు పెద్ద యుద్ధం చేసినట్టు. అబ్బే! పాప తెలివైనది. అంతటితో ఊరుకుంటే ఇంకేం? "నాన్నా! అలా కాదు. ఒక్కపేరే చెప్పాలి" అంది పట్టుపడుతూ. ఆయన ముఖం చూడబుద్ధి కాలేదు. గొంతు తగ్గించి, "నీవేనమ్మా!" అని ఎత్తుకు ముద్దు పెట్టుకున్నారు. ఆయ నన్న మాట నేను వినకూడదని ఆయన అభిప్రాయంలా ఉంది, ఆ టాపిక్ మార్చాలని నిష్ప్రయత్నం చేశారు. పాప మళ్ళీ ఇంకో సమస్య తెచ్చిపెట్టిం దాయనకు. "నాన్నా! మరి. . . మరి అమ్మని నే నిలాగే అడిగాననుకో, అప్పుడు అమ్మ నీ పేరు చెపితే?" అంది. ఒక్క క్షణం ఆయనకు ప్రశ్న అర్థం కాలేదు. వెంటనే గలగలమని నవ్వేస్తూ, "ఓస్. . . అదా! అంటే అననీ. నాకు నువ్వే ఇష్టం" అన్నారు. పాపకు కోపం వచ్చి నట్లు ఉంది. ఆయన ఒళ్ళో నుంచి దిగి పోయింది. "నాన్నా! నీ జట్టు పచ్చి. . . పాపం, అమ్మ వింటే బాధపడదా? అమ్మకు నీ వంటే ఇష్టం ఉండవచ్చు గాని. . . నీకు లేదా? ఫో . . . నీతో మాట్లాడను" అంది బుంగమూతి పెట్టి. వెనక్కి తిరిగి చూశాను. అసహాయంగా నా కళ్ళలోకి చూశారు శ్రీవారు. పాప దగ్గరకు నడుచుకు వచ్చాను. నన్ను చూసి బిత్తరపోయింది. వెంటనే తమాయించుకుని, "అమ్మా! నాన్నకు నీ వంటే ఇష్టం లేదట. కానీ ఇష్టకమ్మా నాన్నకి" అంది. జరిగింది ఆయన వివరించ బోయారు. కాని, నాకు ఏమీ వినిపించ లేదు. నాలో నేనే గొణుక్కున్నట్టు అన్నాను: "అవును. పాప ముమ్మూర్తులా మాధవే!" ఆయన తల వంచుకొని లోపలికి వెళ్ళిపోయారు.



* * *

పది సంవత్సరాల క్రిందట జరిగిన ఈ సంఘటన ఈ రోజు గుర్తుకు వచ్చింది. కారణం అయిదేళ్ల పాప వాళ్ల నాన్న నడిగి ఆయన్ని ఇబ్బంది పెట్టే నట్లే. . . ఇంచుమించు అలాంటి ప్రశ్నే వాళ్ళ అమ్మమ్మని అడుగుతూంది, పదహారేళ మాధవి ఈ రోజు. పురాణం

# జీవిత చక్రంలో పరిభ్రమించే ఆత్మీయులు

'కృష్ణప్రియ'

చదువుకుంటూంది అమ్మ. కాలేజీనుంచి రాగానే ఒక అరగంట ఆవిడతో బాతాఖానీ వేయడం మాధవికి అలవాటు. రోజూలాగే ఆ రోజుకూడా బుద్ధిగా అమ్మమ్మ దగ్గర కూర్చుని, "అమ్మమ్మా! నే నొక ప్రశ్నడుగుతాను. సూటిగా సమాధానం చెప్పు— నీకు రుక్మిణి ఇష్టమా? అందరూ అహంకారి, అసూయావర్తనురాలు అనుకున్న సత్యాదేవి ఇష్టమా? చెప్పు. చెప్పు, అమ్మమ్మా!" అంది. ఆవిడ ముసిముసి నవ్వులు నవ్వుతూ మనుమరాలి బుగ్గలు సాగదీసి ముద్దు పెట్టుకొని, "పిచ్చిపిల్లా! రుక్మిణి అంటే ఎవరనుకున్నావూ? సాక్షాత్తు శ్రీ మహాలక్ష్మి కదే! ఆ మహాతల్లికి తెలియని విషయం ఏముంది గనకా! సత్యభామ పంతాలకు, పట్టుదలలకు రుక్మిణి మౌనంగా ఎలా ఊరుకుందే ఆ పారిజాతం విషయంలో? ఆఖరికి ఒకే ఒక్క తులసి దళంతో స్వామిని దక్కించుకుని సత్య పొగరు వదిలించిన రుక్మిణి అంటే ఎవరికి ఇష్టం ఉండదూ?" అంది. మాధవి వెంటనే కోపంగా ముఖం పెట్టి—"అవును. ఆవిడ మహాలక్ష్మి కాబట్టి, స్వామి పూర్తిగా తనవాడేనని తెలును కాబట్టి సత్యతో పంతానికి పోలేదు. కాని, పాపం, సత్యభామ! నా కెంత ఇష్టమో తెలుసా సత్యంటే? సత్యమనస్సెవరు అర్థం చేసుకోగలరు?! కృష్ణుడంటే సత్య కెంత ఇష్టమంటే— తనని తప్ప స్వామి మరెవరిని ఇష్టపడకూడదు. అంతేనా? తన స్వామిమీద ఇంకెవరూ మనస్సు పడకూడదని ఆ అమాయకురాలి బాధ. ఆఖరికి తన స్వామి శిరస్సున అనునిత్యం నిలుచున్న శిఖిపింఛాన్ని చూసికూడా సహించలేకపోయేది ఆమె మనస్సు. అమ్మమ్మా! అది నిజమైన ప్రేమంటే, అనురాగమంటే! ఒక్క క్షణంకూడా కృష్ణ సాహచర్యం దూరం కాకూడదని ఆమె మూగబాధ. కవులందరూ అది అహంకారమని వర్ణించారేగాని, నిజమైన ప్రేమకు, మమతకు అర్థం చెప్పలేకపోయారు.

ఒక వ్యక్తిని మనం అభిమానిస్తే, ఆ వ్యక్తి అభిమానం అంతా పూర్తిగా మనకే దక్కాలని అనుకోవడం మన పొరపాటా? అలా అనుకోకపోతే అదంతా *కేవలం నటన. అవును, నటనే"* అంటూ ఉద్రేకంగా చెప్పుకుపోతున్న మాధవి, ఆశ్చర్యంగా తన వంక చూస్తున్న నన్ను చూసి, "అమ్మా! నేను చెప్పింది తప్పా? చెప్పమ్మా! నే నెవర్ని ఇష్టపడినా, అవతలి వాళ్ళు నన్నెంతో అభిమానించాలి . . . అవునమ్మా! అవును!" అంది ఆవేశంగా.

తదేకంగా మాధవి వంక చూసి, "మధూ! ఒక ప్రశ్న అడుగుతాను, నిజం చెప్పు. మీ అమ్మ అంటే నీ కెంత ఇష్టమో నాకు తెలుసు. నాకు నీ వెంత ఇష్టమో, తమ్ముడు కృష్ణఅన్నా అంతే ఇష్టం కదా? నేను కృష్ణతో ప్రేమగా మాట్లాడితే జెలసీ ఫీల్ అవుతావా!" అన్నాను.

మాధవికి జవాబేం ఇవ్వాలో తెలిసినట్టు లేదు. చాలాసేపు మౌనంగా ఊరుకుంది. నా వంక అసహాయంగా చూసి కళ్ళు దించుకుని మెల్లగా అంది: "అదెలా కుదురుతుందమ్మా! తల్లి ప్రేమలో పిల్లలందరకూ భాగ ముంటుంది. కాని, మిగతా అనుబంధాలు కేవలం ఒక్కరికే పరిమితం. అలాంటప్పుడే ఇలాంటి సమస్యలు వస్తాయి."

పోనీ! మాధవి ఇందులోనైనా రాజీకి వచ్చింది. అదే చాలు. నా మనస్సు కుదుటపడింది.

హాస్పిటల్‌నుంచి వచ్చి భోజనం చేసి మంచంమీద అలా నడుం వాల్చాను. అంతలో వంటావిడ హడావిడిగా లోపలకు వచ్చి నిలుచుంది. "అమ్మా! అమ్మాయి గారు కాలేజీనుంచి తొందరగా వచ్చేశారు ఈరోజు. వచ్చిన దగ్గరి నుంచి గదిలో పడుకున్నారు. భోజనం కూడా చేయలేదు." ఒక్కసారి లేచి ఆవిడ ముఖంలోకి చూశాను. తల దించుకు నిలుచుంది.

**ఎదిగిన మనసు చుట్టూ అనేకులను చూస్తుంది. ఎంతో మందితో అభిమానాన్నీ, అనుబంధాన్నీ పెంచుకొంటుంది. చిన్నప్పటి అభిమానం వేరు, పెరిగిన అనంతరం అభిమానం వేరు దేని కది పరిమితమే. ఇలా జీవిత చరమావస్థ వరకు ఎన్నో రకాల అభిమానాలు, అనుబంధాలు ఏర్పడుతూనే ఉంటాయి జీవి కదే అపురూపమైనది. ఇదంతా ప్రకృతిబద్ధంగా సాగే జీవిత చక్రం.**

మేడమీద మాధవి గదిలోకి వెళ్ళి చూశాను. ఏడ్చి ఏడ్చి నిద్ర పోయినట్టుంది. దగ్గరకు వెళ్లి మంచంమీద కూర్చున్నాను. మెలకువ వచ్చినట్టుంది— నన్ను చూసి మళ్ళీ కళ్ళు మూసుకోబోయింది. లేపి కూర్చోబెట్టాను. నన్ను పట్టుకుని ఏడ్చేసింది. దాన్ని బుజ్జగించి కారణం చెప్పమని బలవంత పెట్టాను. అది చెప్పిన కారణం వింటే మతి పోయింది. "అమ్మా! నీకు తెలుసుకదా— నా ఫ్రెండ్ రాధ— అదంటే నా కెంత ఇష్టమో నీకు తెలుసు కదమ్మా? దానికి చెప్పకుండా ఏ విషయం దాచను. అది మొన్న నాకు చెప్పకుండా సుగుణతో పిక్చర్‌కి పోయింది. అదొక్కటే కాదమ్మా! దాని పెళ్ళి నిశ్చయమైందట కూడా. నాతో మాట మాత్రమైనా చెప్పలేదు. మా కాలేజీలో అందరికీ తెలిసింది ఈ సంగతి. దాని ఫ్రెండ్ నయిన నాకే తెలియలేదంటే నా కెంత చిన్నతనమనిపించిందో తెలుసా! అమ్మా! రాధంటే పిచ్చిగా నేనే అభిమానించాను. అది ఎంత మోసం చేసింది! ఈ జన్మలో దాని ముఖం చూడను." ఆ మాటలు విని దాని కేమని చెప్పి ఓదార్చాలో అర్థం కాలేదు. అయినా తమాయించుకుని, "పిచ్చి మధూ! ఈ విషయానికే అలా చిన్నపిల్లలా ఏడుస్తున్నావా? ఏమిటమ్మా ఈ పసితనం! నేను రాధను కనుక్కుంటాగా సంగతేమిటో" అన్నాను.

"అక్కర్లేదు. నీ వడగక్కర్లేదు" అంది విసురుగా. "పద, భోజనం చేద్దువుగాని" అని దానిచేత బలవంతంగా భోజనం చేయించేసరికి బ్రహ్మప్రళయం అయింది.

మరునాడు నేను హాస్పిటల్ నుంచి తిరిగి వచ్చేటప్పటికి, డైనింగ్ హాలులో రాధా, మధూ—ఇద్దరూ కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేస్తున్నారు. నా వంక చూసి సిగ్గుతో తల దించుకుంది మాధవి.

వాళ్ల నాన్నగారు పిలిచారని లోపలకు వెళ్లింది మధు. ఇదే సమయమని రాధని పిలిచి, "ఏమమ్మా, రాధా? పెళ్ళి నిశ్చయం అయిందట కదా?" అన్నాను. రాధ సిగ్గుపడి, "లేదు, ఆంటీ! నిశ్చయం అవుతే మీకు తెలియదా? మా అమ్మగారు ఈ సంబంధం గురించి సుగుణ వాళ్లమ్మగారితో చెప్పారు. సుగుణ ఆ సంగతి ఊరంతా చాటింది" అంది.

నిజమే! రాధ ఈ చిన్న విషయం చెప్పడానికి సిగ్గుపడి ఉండవచ్చు. అందుకే మాధవికి చెప్పలేకపోయింది. కాని, ఈ విషయం గురించి మాధవి ఎంత మథనపడిందో గుర్తుకు వస్తే మనస్సు చివుక్కుమంది. జీవితాంతం మాధవి ఇలా ప్రవతి

విషయానికి బాధ పడుతుందా? భగవాన్! నన్ను. మాధవి. . . నా మాధవిని నాకు దూరం చేయకు. నా మనస్సు మూగగా రోదించింది.

ఆ రోజు హాస్పిటల్‌లో చాలా కేసులు చూసి ఆలస్యంగా ఇంటికి వచ్చాను. భోజనంకూడా చేయ బుద్ధి కాలేదు. మంచంమీద పడుకుని పక్కనున్న కిటికీ లోంచి చూస్తూ అలా ఉండిపోయాను చాలా సేపు. చక్కటి పండువెన్నెల. చక్కగా విర బూసిన పూలమొక్కలు— గులాబీ, మందార, జాజి, విరజాజి, నైట్ క్వీన్. పూవులన్నీ చెట్లకే ఉన్నాయి. పూలు కోయడం మాధవికే అలవాటు. మాధవి ఊళ్ళో లేదని చెట్లు చూసిన ప్రతి వాళ్ళు అడుగుతారు. పూలమీద నుంచి వచ్చే పిల్లవాయువుల కమ్మని పరిమళాలతో హాయిగా ఉం దా దృశ్యం. కిటికీలోనుంచి చూస్తూ అలాగే రెప్ప వేయకుండా పడుకున్నాను. పూర్ణ చంద్రుణ్ణి చూస్తుంటే మాధవి ముద్దుమోమే గుర్తుకు వస్తుంది. వాళ్ళ బాబాయిగారి ఇంటికి వెళ్ళి ఇంకా వారం రోజులుకూడా కాలేదేమో? కాని, అది వెళ్ళి ఒక యుగం అయినట్టు ఉంది. ఆయన ఇంకా ఆఫీసునుండి రాలేదు. కృష్ణకి ఎప్పుడు చూసినా ఫ్రెండ్స్, ఆటలు, క్రికెట్ మాచ్‌లు— ఇవి తప్ప ఇల్లు వాకిలి అక్కర్లేదు వాడికి. ఎవరో గదిలోకి వచ్చిన చప్పుడైంది. ఆయన ఆఫీసునుంచి వస్తూనే సరాసరి నా గదికి వచ్చిన ట్టున్నారు. ఎందుకో ఆయన ముఖం చూస్తే మామూలుగా లేదు. ఎంతోసేపు ఏదో ఆలోచనలతో బుర్ర బద్దలు కొట్టు కున్నట్టు, సమస్యను తీర్చలేక, చేతకాక, ఎవరితోనూ చెప్పలేక బాధపడుతున్న ట్లని పించింది. కోటు విప్పి మంచం మీద పడేసి ఈజీఛెయిర్‌లో నడుము వాల్చారు. నా వంక చూసి మెల్లగా అన్నారు: "వసూ! పాప నిజంగా మాధవే. . . ఇంతకాలం ఎన్నోసార్లు మాధవిని గుర్తు చేసుకున్నావు. కాని, ఈ సారి నేనూ నమ్ముతున్నాను. నిజంగా మాధవే దిగి పాపగా నీ కడుపున పుట్టింది."


"నిజమేనండి. పుట్టుకతోనే, పోలిక లలో మాధవిని పోలిందని ఆ పేరు పెట్టాము. కాని, మాధవిలా పాప బలి కాకూడదండి. . . కాకూడదు." బాధతో గొంతు వణికింది. మెల్లిగా ఆయన కళ్ళలోకి చూస్తూ, "ఇంతకీ ఏం జరి గింది?" అన్నాను.

నా వంక చూసి, కోటు జేబులోంచి ఒక ఉత్తరం తీసి నా చేతిలో పెట్టారు. అది మాధవి వాళ్ళ నాన్నగారి పేర వ్రాసిన జాబు.

"డాడీ!

ఇక్కడనుంచి నేను రెండు రోజు లలో బయలుదేరి ఇంటికి వచ్చేస్తున్నాను. సెలవులు ఇచ్చారంటే మొదటిసారిగా గుర్తుకు వచ్చింది బాబాయిగారి ఇల్లు— ముఖ్యంగా శేఖర్ అన్నయ్య, శాంతి. గం ల పెట్టి ఇక్కడకు వచ్చానా— నేను మనస్సులో ఊహించుకొని పదిలపరుచు కున్న అనుభూతి ముందు ఇది విర్జీవంగా ఉంది. కారణం వింటే మీరు అర్థం చేసుకోపోవచ్చు. నా లాంటి మనస్తత్వం మీ కెవ్వరికీ లేకపోవచ్చు. ఈ ఇంట్లో అందరూ నన్నెంతో బాగా ఆదరించ వచ్చు—ముఖ్యంగా శేఖర్. . . శేఖర్ మనస్సులో శాంతిమీద ఉన్న అను రాగం నా మీద లేదు. మీ రనవచ్చు— శాంతి శేఖర్‌కి రక్తం పంచుకు పుట్టిన చెల్లి, నేను కాదని. కాని, నాన్నగారూ! ఈ ఒక్క కారణంవల్ల శేఖర్‌కు నేను దూరం కాకూడదు. అనుబంధాలు పెరగడానికి ఒక్క రక్తసంబంధమే కారణం కావవసరం లేదు., నాన్నగారూ, కానవసరం లేదు. నిండుమనస్సుతో ఒక మనిషి మీద మనకు తెలియకుండానే అభిమానం పెరగటం మన తప్పిదం కాదు. అది ఏ రకమైన బంధమో, అనుబంధమో ఆ క్షణంలో అర్థం కాదు. నేను శేఖర్‌ని అన్నగా అభిమానించడానికి శేఖర్ నాకు ఒక కజిన్ బ్రదర్‌కూడా కానవసరం లేదు, నాన్నగారూ! ఇదే ఫీలింగ్ బయట ఉన్న ఏ వ్యక్తిమీద నా కేర్పడినా ఇలాగే అభిమానించేదాన్ని. డాడీ! మీకు అర్థం కావడం లేదుకదూ? ఇలాంటి సున్నిత మైన ఫీలింగ్స్ అమ్మకు కాక మీకు ఎందుకు వ్రాస్తున్నానంటే, డాక్టర్‌గా మారిన అమ్మ జీవితం అంతా యాంత్రికం గానే గడిచిపోతూంది, అర్థం చేసుకో లేదేమో అని.

నాన్నా! నన్ను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి. ఉదాహరణకి నిన్న జరిగిన ఈ ఒక్క సంఘటన వ్రాస్తు న్నాను. ఉదయం నేను లేచేసరికే లోపల గదిలో శేఖర్, శాంతి మాట్లాడుకుంటు న్నారు. 'శాంతీ! మధు రెండు రోజులలో వెళ్ళిపోయే పిల్ల. దానితో నీ కేమిటి వంతు? నీకు తరవాత కొంటానుగా మంచి చీర. . . మనస్సు చిన్నబెట్టుకో కమ్మా, మధూకి చీర కొన్నానని' అంటున్నాడు శేఖర్ శాంతితో. శాంతి శేఖర్‌తో అంది: 'పిచ్చి అన్నయ్యా! తమాషాకిఅడిగానుకాని,నిజానికి మాధవితో నాకు వంతేమిటి! పిచ్చిమధు. . . నీ



రేఖా శోభ
చిత్రం—కె. వి. రాఘవస్వామి

లాంటి అన్నయ్య లేని అది దురదృష్ట వంతురాలు.'

నాన్నా! ఇది విని నే నెంత షాక్ తిన్నానో మీరు ఊహించలేరు. శేఖర్ అలాకాకుండా ఆ డబ్బుతోనే నాకు, శాంతికి చెరొక జాకెట్టు సంతోషంగా కొనిపెట్టి ఉంటే మురిసిపోయేదాన్ని. శేఖర్ శాంతిని ఎలా బుజ్జగించి అనునయించబోయాడో, అలాగే నాతోనూ అని ఉంటే నే నెంతో మురిసిపోయేదాన్ని. అయినా శేఖర్ శాంతిలా నన్ను చూడలేదు. నా నుంచి శాంతికి అన్యాయం జరగడానికి వీల్లేదు. నా మీద ఉండే ఏమాత్రపు అభిమానంతో కూడా శేఖర్ శాంతిని చిన్నచూపు చూడ్డానికి వీలులేదు. శేఖర్ మనసులోని అనురాగమంతా శాంతికే దక్కనీయండి, నాన్నగారూ! దానికే దక్కనీయండి. ఆశ్చర్యపోతున్నారు కదూ? మంకుపట్టు పట్టే మీ మాధవి ఇంత బుద్ధి అయి పోయిందేమా అనుకుంటున్నారు కదూ? కారణం చెప్పమన్నారా? నేను ఊహించిన శేఖరన్నయ్య నాకు దొరకనప్పుడు. . . నాకు వద్దు. ఆ అభిమానాన్ని డైల్యూట్ చేసి శాంతితో నేను వంతుకు పోను. శాంతికి నేను మోసం చేయను, నాన్నా! న న్నర్థం చేసుకోండి. అందుకే గిల్లికజ్జా పెట్టుకున్నాను శాంతితో. కోపంతో ఇంటికి వస్తున్నట్టు నటిస్తున్నాను. కారణం— శేఖర్‌కి నా మీద కోపం బాగా రావాలి. . . నన్ను మరిచిపోవాలి. మరి నేను . . . నాకు వాస్తవంలోకన్నా ఊహాలలోనే ఎక్కువ ఆనందం దొరుకు తుంది.

మీ. . .

—మధు."

ఉత్తరం పూర్తిచేసి, ఆయన వంక చూశాను. నాకు తెలియకుండా నా కళ్ల వెంట ధారలుగా నీళ్ళు కారుతున్నాయి. "వసూ! ఏడుస్తున్నావా? నీవు తప్పి అర్థం చేసుకోలేవని, నేను తనని సమర్థిస్తా నని మాధవి నాకు లెటర్ వ్రాసింది. కాని, నిజం తెలిస్తే మాధవి నన్ను క్షమిస్తుందా? ఈ మూగప్రేమ దాని కెలాఅలవడింది?ఒక మాధవిని అజ్ఞానంగా దూరం చేసుకున్నాను. కాని, నా చిన్నారి ఈ మాధవిని మాత్రం దూరం చేసుకో లేను, వసూ! దూరం చేసుకోలేను." టేబిల్‌మీద తల పెట్టి అలా కూర్చుండి పోయారు.

నా మనస్సు ఎలా ఉందో నాకే తెలియటం లేదు. ఏమి చెప్పి ఆయన్ని ఓదార్చను? మాధవిని ఈ అశాంతి నుండి ఎలా దూరం చేయను? ఆయన ఈ రోజు బాధపడుతున్నారు. నేను. . . మాధవి మాటలు నేర్చిన దగ్గరినుంచి బాధపడుతున్నాను. దాన్ని అందరిలా ఆలోచించేలా చేయాలని, ప్రపంచానికి ఎదురీది వెళ్ళలేమని ఎన్నెన్నో చెప్పి దాని మనస్సు మార్చాలని ప్రయత్నిస్తూ ఉన్నాను. అది నెరవేరేది ఎప్పుడో!

• • •

ఊరునుంచి వచ్చేసింది మాధవి. ఉత్తరం సంగతి తెలియనట్టు మాట్లా డాను దానితో. ఎంతో చురుకుగా ఉండే మాధవి ఎంతో భారంగా, ఏదో తప్పు చేసినదానిలా మౌనంగా ఉండటం సహించ లేకపోయాను. మాటల్లో, చేతల్లో నన్ను తప్పించుకోవాలని ఎంతో ప్రయత్నించింది. దా న్నలా చూస్తుంటే గుండె తరుక్కు పోతూంది. దాన్ని మామూలుగా చేయా లని నేను, ఆయన, కృష్ణ ఎంతో ప్రయత్నించాము. జీవితంలో ఎప్పుడూ ఆడింది ఆట, పాడింది పాటగా జరిపించు కున్న మాధవి తనకు తానే ఓటమి నాపాదించుకుని, తనను తానే శిక్షించు కుంటుందా అనిపించేది దాన్ని చూస్తుంటే. ఈ శిక్ష దానికి కాదు, నాకు; ముఖ్యంగా శ్రీవారికి. ఒక్కసారి చనిపోయిన మాధవి, మూర్ఖంగా తన ప్రాణాలు బలిపెట్టుకున్న ఆ మాధవే

తన కసి తీర్చుకోవడానికి వచ్చి నా కడుపున పుట్టి మమ్మల్ని ఇలా ఏడిపిస్తుందా అనిపించేది.

ఆ రోజు కళ్యాణి ఊరునుంచి వచ్చింది. మెడిసిన్ చదివేటప్పుడు అది, నేను క్లాస్‌మేట్స్. అంతేకాదు, ప్రాణ స్నేహితులమనే చెప్పాలి. మాధవి మనస్సు కష్టపెట్టడం ఇష్టం లేక, కళ్యాణితో మాధవి ఎదురుగా ఆ రోజుల్లో మాట్లాడే దాన్ని కాదు. కాని, కాలేజీలోని అన్నీ నేను, కళ్యాణి ఒకే బాటమీద నడిచాము. చాలా రోజుల తరవాత నన్ను చూడడానికి వచ్చిన కళ్యాణి రాకతో ప్రపంచమే మరిచిపోయాము. ఆ నాలుగు రోజులు హాస్పిటల్, ఇల్లు, మనుషులు—అంతా మరిచిపోయాము. మాధవిని చూసి ఎంతో ముచ్చట పడింది కళ్యాణి. వాళ్ల ఇంటికి రమ్మని ఎంతో బలవంతం చేసింది. మాధవి బదులే పలకలేదు. కళ్యాణి మీద మధు కింత కోపమెందుకో అర్థం కాలేదు.

కళ్యాణి వెళ్లిపోయిన రోజు మాధవిని పిలిచి తల దువ్వబోయాను. ఎన్నో రోజుల తరవాత ఎందుకో మాధవికి జడవేసి, బొట్టు పెట్టి, నాకు నచ్చిన బట్టలు వేసుకోమని, దగ్గరుండి ఎక్కడికైనా తీసుకువెళ్లి మనసు తీరా మాట్లాడాలని, ఒక తల్లిగా కాక ఒక ఆత్మీయురాలిగా నా మనస్సులోని ఆవేదన చెప్పాలని ఆరాటపడ్డాను. కాని, మాధవి నా కా అవకాశం ఇయ్యకుండానే— "ఓహో, నీ ఫ్రెండ్ లేదుకదూ? అందుకు నేను గుర్తుకువచ్చానా? అక్కరలేదు. నా కెవరూ అక్కరలేదు. నేను ఒంటరిగా బ్రతకగలను" అని అక్కడినుండి తన గదిలోకి వెళ్లిపోయింది.

"మాధవీ! ఏమిటమ్మా ఈ మాటలు? కళ్యాణి నా ప్రియమైన చిన్ననాటి స్నేహితురాలు. ఎంతో కాలానికి నన్ను చూడాలని మనసుతీరా వస్తే ఆ మాత్రం కలిసి తిరగడం తప్పా?" దాని గది లోపలకు వెళ్లి అన్నాను. జవాబు ఇవ్వకుండా తల విదిలించి, జోళ్లు వేసుకొని కాలేజీకి వెళ్లిపోయింది.

మాధవిని చూస్తూ అలాగే ఉండిపోయాను. 'భగవంతుడా! నా బిడ్డ మాధవిని నాకు దూరం చేస్తావా! ప్రకృతికి విరుద్ధంగా మనిషి పరుగెట్టలేదని దానికి తెలియజెప్పు. కాని, ఈ లోపున నా మాధవి ఆ మాధవిలాగానే నాకు దూరం అయిపోతే. . .'

గదిలోపల టేబిల్‌మీద దాని డైరీ కనిపించింది. చదవకూడదని తెలిసినా, మనస్సు తొందరపెట్టింది. ముందు రోజు రాత్రి వ్రాసింది. . .

"కళ్యాణి వచ్చిందని అమ్మ నన్ను మరిచిపోయింది. అమ్మ, కళ్యాణి ఇంచుమించు ఒకే కంచంలో తిన్నారు. ఒకే మంచం మీద పడుకున్నారు. కళ్యాణి ఏమంటే అమ్మ అదే 'సై' అంది. మొన్న సాయంత్రం బీచ్‌కి వెళదామని అమ్మతో అన్నాను. కాని, కళ్యాణి పిక్చర్‌కి రమ్మంటే దానికే బయలుదేరారు. నన్ను రమ్మని బలవంత పెట్టినా వెళ్లలేదు. నా కోసం అమ్మ మానుకుంటుందనుకున్నాను. ఊహూఁ! అమ్మ, కళ్యాణి హాయిగా సినిమా చూసి వచ్చారు. ఏడ్చి ఏడ్చి నిద్ర పోయాను నేను. వాళ్ళు వచ్చి హాయిగా భోజనం చేసి కబుర్లు చెప్పుకుంటూ నిద్ర పోయారు. అమ్మ దగ్గర కూడా పడుకోవటం నా కలవాటు లేదుగా? అందుకే కోపం దిగమింగుకొని మేడ దిగాను. అప్పటికే అమ్మ, కళ్యాణి ఒకే మంచంమీద నిద్ర పోతున్నారు."

డైరీ ఇక చదవలేకపోయాను. 'మాధవీ! నీవు నాకు బాగా అర్థమయ్యావమ్మా! నీకుకూడా నీ మనస్సు అర్థం కాలేదు. కాని, నాకు బాగా తెలుసమ్మా నీ మనస్సు. పిచ్చిపిల్లా! కళ్యాణి కోసం నన్ను దూరం చేసుకుంటున్నావా?' బరువుగా నిట్టూర్చాను. దానికి మనశ్శాంతి ప్రసాదించమని భగవంతుడిని వేడుకున్నాను.

• • •

ఆ రోజు రాత్రి లెటర్ వ్రాయటం మొదలు పెట్టాను.

"ప్రియాతి ప్రియమైన నా చిన్నారి మధూ!

జాబు వ్రాస్తున్నది మీ అమ్మ అని తలచకుండా, మనఃస్ఫూర్తిగా నీవు ప్రేమించే ఒక వ్యక్తి, అంతకు వెయ్యింతలు బదులుతో నీ అభిమానాన్ని అర్థం చేసుకుని ప్రేమగా, నీ శ్రేయోభిలాషిగా వ్రాస్తున్న ఈ జాబు పూర్తిగా చదువుతావు కదూ? మాధవీ! నీకు కొన్ని విషయాలు నా జీవితంలో చూసినవి, అనుభవించినవి చెపుతాను. అర్థం చేసుకో. నీకన్నా ఈ ప్రపంచాన్ని ముందు చూసింది నేను. నీకన్నా నా కెక్కువ అనుభవముంది. ఒప్పుకుంటావు కదూ? విను.

నాకు మాధవి అనే ఒక ప్రాణ స్నేహితురాలు ఉండేది. నా హైస్కూలు రోజులలో ఏర్పడిన ఆ అమాయక స్నేహం మూడు పువ్వులు ఆరు కాయలుగా వికసించింది. పోలికలు, గుణాలు, బుద్ధులు ముమ్మూర్తులా నీవే! నీవు నా కళ్లెదుట మసలినంత కాలం దానిలోటు నాకు ఉండదు. అనాడు — ఈ రోజు నిన్ను మార్చాలని ప్రయత్నించినట్లే దానినికూడా ప్రయత్నించి మార్చగలిగి ఉంటే నా మాధవి నాకు దక్కేదేమో అనిపిస్తుంది ఒక్కొక్కసారి.

పుట్టింది పేద కుటుంబంలోనైనా, పదహారణాల పూర్తి ఆత్మవిశ్వాసమున్న మాధవి నా ప్రాణం. నా మనస్సులో దానికి తప్ప ఎవరికీ చోటు ఉండకూడదని దాని బాధ. అలాగే రోజులు ఎంతో హాయిగా గడిచిపోయాయి.

నేను మెడిసిన్ ఆఖరు సంవత్సరం చదువుతున్నాను. మాధవి ఆర్థికంగా పై చదువులు చదవలేక పి. యు. సి. పాసయి మానేసింది. తనకూడా ఒక డాక్టరు కావాలని ఎంతో ప్రయత్నించాను. కాని, నా మాట వినలేదు. దాని దృష్టిలో స్నేహం స్నేహమే. అవసరం అవసరమే! అవసరం కోసం స్నేహం నటించటం దానికి ఇష్టం ఉండేది కాదు. ప్రతి సాయంత్రం మేము విధిగా కలుసుకుని కబుర్లు చెప్పుకునే వాళ్లం. కాలేజీ విశేషాలు అన్నీ చెప్పినా, కాలేజీలోని నా ఫ్రెండ్స్ విషయం దాని దగ్గర దాచేదాన్ని. దాని మనస్తత్వం చూస్తే నా కెంతో ఆశ్చర్యం వేసేది.

మనం ఒక వ్యక్తిని అభిమానిస్తాం. ఆ వ్యక్తి అభిమానాన్ని పొందాలని ఆకాంక్షిస్తాము. అంతకు మించి అందులో లాభనష్టాలు, దీని ద్వారా మిగతా వారికి కలిగే అశాంతి—ఇవన్నీ ఆలోచిస్తూ అభిమానించటం మొదలు పెట్టము. కాని, మాధవి ఆలోచనా, ఆవేదనా వింటుంటే అనవసరంగా మానసిక అశాంతితో బాధపడుతున్న తన మనస్సును మార్చాలని అనుకొనేదాన్ని. తన మనసులోని మమతా మాధుర్యాలు కలబోసి మాల చేసి నా మెడలో వేసింది. ఆ మాల నా జీవితాంతం నేను ఉంచుకోవాలని, ఇందులో భాగం ఇంకెవరికీ ఉండకూడదని ఆరాటపడేది. శారీరకంగా ఎదిగిందేగాని, మానసికంగా పసిపిల్లను పోలిన మాధవి మనసుని, మమతను చూసి నా కళ్లు చెమ్మగిల్లేవి.



లతాంగి
చిత్రం—గోలి కృష్ణహరి

విదేశాలనుంచి తిరిగి వచ్చారు బావ శ్రీకాంత్. ఆ రోజు పిక్చర్‌కి బయలుదేరాము ఇద్దరం. అదే సమయానికి చేతిలో ఒక గులాబీ పువ్వుకొని కారుకు ఎదురువస్తూ కనిపించింది మాధవి. కారు దిగబోయాము. ఆయన వారించారు— 'తరవాత మాట్లాడవచ్చులే' అంటూ. సినిమా చూస్తున్నానన్న మాటే గాని, మనస్సంతా మాధవి గురించే. దీనిగురించి ఎంత బాధపడిందో, పిచ్చిపిల్ల!

మర్నాటి ఉదయమే వాళ్లింటికి వెళ్లాను. నన్ను చూస్తూనే ఆనందంగా లేవబోయి మళ్లీ సీరియస్ అయిపోయింది. నాకు కళ్లలో నీళ్లు తిరిగాయి. బలవంతంగా దాన్ని పట్టుకుని మంచంమీద కూచోబెట్టాను. 'మధూ! కోపమొస్తే కొట్టు, తిట్టు. అంతేగాని, నన్ను చూసి ఇలా ముభావంగా ఉండదు' అన్నాను.

'వసూ, నీ వేనా ఇలా మాట్లాడుతున్నదీ? అయినా, నే నెందుకు గుర్తు వస్తాను!? నీ వెక్కడా, నే నెక్కడా? నీ వొక డాక్టరువి. పైగా, త్వరలో ఒక పెద్ద ఇంజనీరు భార్యవు కాబోతున్నావు. వసూ! ఇది నిజమేనా! నీకు వచ్చే నెంలోనే వివాహమని, ఇక్కడినుంచి వెళ్లిపోతున్నావని మీ అమ్మగారు చెప్పారు. ఇది నిజమేనా? చెప్పు, వసూ, చెప్పు!' అంది ఆవేశంగా.

నాకు ఈ సంగతి దానికి విడమరిచి ఎలా చెప్పాలో తెలియలేదు. నెమ్మదిగా దాని కళ్లు తుడిచి, 'మధూ! ఈ విషయం ఇలా వదిలేయ్. మరి నీ పెళ్లి అయిపోతే మాత్రం దూరంగా వెళ్లిపోవా? అయినా, ఇదెలా సాధ్యం, మధూ, జీవితాంతం మనం కలిసి ఉండటం?' మాట ఇంకా పూర్తి చేయనే లేదు. అది ఆశ్చర్యపోయింది. వెక్కి వెక్కి ఏడుస్తూ, 'ఎంత తేలికగా అనేశావు! మనం కలిసి ఉండటం అసాధ్యమా! నేనే పిచ్చిదాన్ని. పిచ్చిగా మమతలు అల్లుకున్నాను. కేవలం టైమ్ పాస్ చేయడానికే నన్న మాట స్నేహం. జీవితంలో ఇంకొక ఆత్మీయులు దొరికితే, వెనకటి

అభిమానంతో అవసరం తీరిపోక్కే నన్ను మాట. . .' అంది.

భగవాన్! దానికి విడమరిచి ఎలా చెప్పను? పిచ్చి అభిమానంతో అది వాస్తవానికి ఎంత దూరంగా పోతూంది?!

ప్రాణి కళ్లు తెరవని స్థితిలో తల్లి గర్భంలో ఉంటుంది. మొట్టమొదట చూసేది తల్లిని. ప్రపంచమంతా తల్లే అనుకుంటుంది. తండ్రి అభిమానం కూడా తనదే అనుకుంటుంది. తరవాత తమ్ముళ్లు, చెల్లెళ్లతో అనుబంధం మొదలవుతుంది. మానసికంగా ఎదిగిన మనసు, చుట్టూ ఉన్న అనేక మందిని చూస్తుంది. ఎంతో మందితో అభిమానాన్ని, అనుభూతిని పెంచుకుంటుంది. ప్రతి వ్యక్తి పట్ల తన కున్న అభిమానం దేని కది పరిమితమే! ఒకదానికి, ఇంకొకదానికి పోలికే లేదు. తరవాత జీవిత భాగస్వామితో బంధం, తిరిగి కడుపున పుట్టిన బిడ్డల మీద మమకారం— ఇలా జీవిత చరమావస్థవరకు ఎన్నో రకాల అనుబంధాలు, అనుభూతులు ఏర్పడుతూనే ఉంటాయి. దేని కదే అపురూపమయినది. ఇన్ని బంధాలు ఏర్పడ్డాక, ఆ వ్యక్తి తన జన్మనిచ్చిన తల్లితో ఏర్పడిన అనుబంధం మరిచిపోతాడా! ఇదంతా ప్రకృతి బద్ధంగా జరిగే జీవితచక్రం. కాని, మాధవి నే నన్న మాట అపార్థం చేసుకుంది. ఇప్పుడు నే నెంత చెప్పినా అర్థం చేసుకోలేదు. అందుకే మౌనంగా ఇంటికి వచ్చేశాను.

ఒక రోజు మాధవి మా ఇంటికి వచ్చింది. లాన్‌లో బావ కూర్చుని పేపర్ చూస్తున్నారు. ఎప్పుడూ నేను కూర్చునే చోటు. . . పేపరు అడ్డు ఉండడం వల్ల నే ననుకొని ఎదురుగా వచ్చి కూర్చుంది. వచ్చింది నే ననుకొని బావ మాట్లాడడం మొదలు పెట్టారు. గొంతు విని ఉలిక్కిపడి లేవబోయింది. కాని ఆ మాట్లాడే తీరు, ఆత్మవిశ్వాసం ఉట్టిపడేటట్లు విడమరిచి దేని గురించో మాట్లాడే ఆ గొంతు విని ఆశ్చర్యంగా కూర్చుండిపోయింది మాధవి. జవాబు రాక, పేపర్ పక్కనుంచి చూశారు బావ. బెదురుచూపులతో మాధవి పరుగున లోపలికి వచ్చి జరిగింది చెప్పింది. నేను నవ్వి ఊరుకున్నాను.

రోజూ వచ్చే మాధవి నాతోనే కాకుండా బావ శ్రీకాంత్‌తో కూడా మాట్లాడటం మొదలుపెట్టింది. దాన్ని చూస్తే ఆశ్చర్యం వేసింది. నాతో తప్ప దానికి ఎవరితోనూ మాట్లాడడమే రాదనుకునేదాన్ని. అలాంటి మధు నేను లేనప్పుడుకూడా బావతో చనువుగా మాట్లాడేది. ఒక రోజు మాధవితో



దేని అందం దానిది

ఫోటో—ఎస్. రవి (హైదరాబాదు-11)

సరదాకి అన్నాను: 'మధూ! నేను నీతో తప్ప ఎవరితో మాట్లాడినా ఏడ్చేదానివే . . . మరి శ్రీకాంత్‌తో నీవు మాట్లాడుతూ నన్ను మరిచిపోతే నేను బాధపడనా?'

మాధవి కళ్లలో నీళ్లు తిరిగాయి. నా రెండు చేతులు పట్టుకుని అందులో తల పెట్టుకుంది. 'వనూ! నన్ను క్షమించు. నీ పట్ల నా అభిమానం తరుగలేదు, వనూ! తరగదుకూడా. కాని, నా మనస్సు విన్నేకాక ఇంకో ఆత్మీయత, కోసం ఎదురు చూస్తుందని ఈమధ్యే తెలిసింది. శ్రీకాంత్‌తో మాట్లాడుతుంటే ఎన్నాళ్ల క్రిందటో పరిచయమైన వ్యక్తిలా, చనువుగా నాతో మాట్లాడుతుండే ఒక ఆత్మీయుడులా, అన్నింటికీ మించి ఒక ఆప్తుడులా— ఏవో భావాలు నా మనస్సులో మెదిలాయి. ఇది తెంచుకోవాలని ఎంతో ప్రయత్నించాను. కాని, నాకు సాధ్యపడలేదు. అంతే గాని నిన్ను. . . నిన్ను నేను దూరం చేసుకోలేదు, వనూ!' ఏడుస్తుంది మాధవి.

నా మనస్సు ఎంతో హాయిగా ఉంది. నా మాధవి అందరి మనుషులలాగే అందరిమీదా అభిమానం పెంచుకోటం అలవాటు చేసుకుంటుంది.

ఒక రోజు నేను, బావ, మాధవి కలిసి పిక్నిక్‌కి వెళ్లాం. సాయంత్రం వరకు కులాసాగా గడిచిపోయింది. బాస్కెట్స్, ఫ్లాస్క్‌లు, కెమెరాలు-అన్నీ సర్దేస్తుంది మాధవి. బుట్టలో ఒకే ఒక ఆపిల్ పండు మిగిలి పోయింది. పైకి తీసి చూపించింది మాధవి. 'ఇది నాది' అన్నాను. బావ అడిగించడానికి 'మాధవిగారూ! ఆ ఆపిల్ నాకే. . . నేను ఇందాకా తినలేదు. ఇటివ్వండి' అన్నారు. నాకు పంతం వచ్చింది. 'మధూ! నాకు తప్ప నీ వెవరికి ఇవ్వగలవులే! ఇటియ్యి' అన్నాను. నా కంటె నాకు అది బావా నేనూ దెబ్బలాడుకున్నాం. మాధవి ఎవరికీ ఇవ్వలేదు. దాని కళ్లల్లో నీళ్లు చిప్పిల్లాయి. అర్థం కాలేదు బావకి. చిరాకుగా మొహం పెట్టారు. మధు చెయ్యి పట్టుకుని, 'ఏయ్, మధూ! పిల్లి విషయానికి కళ్ల నీళ్లు పెట్టుకుంటావా? చాకుతో రెండు ముక్కలు కోసి చెరి ఒకటి ఇవ్వాలని నీకెందుకు తోచలేదూ! ?' అన్నాను. అది నా కళ్లలోకి చూసి నవ్వింది. 'వనూ! నే నెంత మారిపోయానే! ! నా అభిమానాన్ని. . . నీ కిచ్చిన మమతా మాధుర్యాన్ని. . . ఈ ఆపిల్‌లాగే ముక్కలు కోశానా! !' బాధగా ఏమిటో మాట్లాడుతూంది. దాని మాటలు వింటూంటే దాని ప్రేమ పంతగా పొందిన నా మీద నాకే గర్వంగా ఉంది. కాని, దాని బాధ చూస్తే ఏమని చెప్పి దాన్ని మామూలుగా అందరూ ఆలోచిం

చేలా చేయాలా అని ఆలోచిస్తూ కూర్చున్నాను. బావ చిరాకుగా మమ్మల్ని వదిలి కారులో కూచుని, 'హౌ టు పాస్ టైమ్' చదువుకుంటున్నారు.

అమ్మా, పాపా! జీవితచక్రంలో పరిభ్రమించే మానవుని కంటికి, మనస్సుకు నచ్చిన అనేక వ్యక్తులు అనునిత్యం తారసపడుతుంటారు. అనుబంధాలు వేరు కావచ్చుగాని, అనుభూతులు ఒకటే నమ్మా! కేవలం మనస్సుకు సంబంధించిన ఈ మమతానుబంధాలకై మానవులు ఎందు కింత తాపత్రయ పడతారో అర్థం కాని విషయం. ఒక వ్యక్తితో ఒక లాంటి అనుబంధం; వేరే వ్యక్తితో వేరే లాంటి అనుభూతి. ఒక దాని కోసం ఇంకొకటి ఆపలేం. అన్నీ మన కెంతో కావలసిన స్నేహాలతలే! ఒక వ్యక్తిని చూస్తే ఒక మాతృమూర్తిని చూసిన ఆనందం వెల్లివిరుస్తుంది. వేరొక వ్యక్తిని చూస్తే కలిగేది ఒక సోదరుని చూసిన ఆప్యాయత. ఒక్కొక్క వ్యక్తిని చూస్తుంటే ఎన్నో జన్మలనుంచి పరిచయమైన వ్యక్తులుగా కనిపిస్తారు మొదటి పరిచయంలోనే! నిజానికి ప్రతి వ్యక్తికి ఈ అనుబంధాలు భగవంతుడే కల్పిస్తాడు. ఎవరో దురదృష్టవంతులు తప్ప ప్రతివారికి కన్న తల్లిదండ్రుల అనురాగాలు, తోబుట్టువుల ఆప్యాయతలు తప్పక ఉంటాయి. కాని, మధూ! ఏమాత్రం రక్తసంబంధం లేని వ్యక్తులపైకూడా ఇదే లాంటి అనుభూతులు ఎందు కేర్పడతాయో ఎవరు చెప్పగలరు? ఈ అనుభూతులూ, జీవిత భాగస్వామి మీద ఏర్పడే అనుబంధానికీ ఒక్కటేనమ్మా తేడా! ఈ అనుభూతులని అనేక మందికి పంచగలం. కాని, జీవిత సహచరుడైన వ్యక్తిమీద కలిగే అనురాగం కేవలం ఆ ఒక్క వ్యక్తికి మాత్రమే పరిమితం కావాలి. ఆ అనురాగానికి మాత్రం నీవు ఊహించినట్లు, ఇంకెవరు అడ్డు తగిలినా భరించలేం, తల్లీ! తన భర్త ప్రేమ అంతా తన స్వంతం కావాలని ప్రతి భార్యా కోరుకుంటుంది. తన మనస్సులో ఉండే ప్రేమంతా అతనిమీదనే కుమ్మరిస్తుంది. ఆ ఒక్క అనుబంధం కోసం అవసరమొస్తే మిగతా బంధాలనుకూడా తెంపుకుపోగలుగుతుందమ్మా! ఇది మాటికి మారు పోల్చ సత్యం! !

మాధవీ! ఆ భయంకరమైన ఒకేఒక సంఘటనతో మాధవి నాకు దూరమయిందమ్మా! ఆ రోజు నాకు బాగా గుర్తు... బావతో మధు సంగతంతా చెపుతున్నాను. అంతా విని తేలికగా కొట్టి పడేశారు. నాకు చాలా కోపం వచ్చింది. చాలా

రోషగా మాట్లాడుకున్నాము. మాధవి లాంటి వ్యక్తి, అలాంటి ప్రేమ ఈ జన్మలో మీకు దొరకదన్నాను. ఆయన కోపంగా— 'వసూ! నీ స్నేహితురాలంటే నీ కిష్టం ఉండచ్చు. నీమీద ప్రేమకొద్దీ నేను ఇష్టపడచ్చు. కాని, ఇది నీ వన్నట్టు "జన్మ జన్మాంతర సంబంధం. . ." అని ఏమేమో అన్నావే! అదంతా నాన్సెన్స్. అయినా, ఇలాంటి మనుషులు చాలా ప్రమాదం. ముందు రోజు నీవూ, నేనూ పిక్చరు కెళితే ఎంతో జెలసీ ఫీలయిందన్నావు. అలాంటి వ్యక్తి ఈ రోజు నన్నభిమానించడం మొదలు పెట్టిందని, మనిద్దర్నీ ఒకేలాగ ట్రీట్ చేస్తుందని అంటే నే నెలా ఒప్పుకుంటానూ! నాతో మాట్లాడడం నీ కోసం అలవాటు చేసుకుంది. అది నిజమైన అభిమానం కాదు. అయినా, ఇదెలా సాధ్యం? నాలుగు రోజుల క్రిందట పరిచయమైన వ్యక్తిమీద ఇంతటి అనుబంధం పెంచుకోవడం— ఇదంతా పిచ్చి, వసూ, పిచ్చి. మీ ఆడవాళ్లకు ఈ స్నేహాలు, అనుబంధాలు—ఇలాంటి పిచ్చి పిచ్చి భావాలకంటే ఆలోచించే విషయాలు ఏమున్నాయి గనక! ఇంచుమించు ఇదంతా నటన. ఇలాంటి రిలేషన్స్ అంటే నా కసహ్యం. వసూ! దయచేసి సాధ్యమైనంతవరకు ఆ మెంటల్ పేషెంట్‌తో మాట్లాడటం తగ్గించు' అని మాటలు పూర్తిచేసి గొప్పగా ఒక సిగరెట్ వెలిగించారు.

ఆ మాటలు విని నా కెంత ఆవేశం వచ్చిందో, నా మనస్సులో ఎన్ని భావనలు పెనవేసుకుపోయాయో ఎలా చెప్పను, పాపా! ఎలా చెప్పను, మధూ! ఈ ప్రపంచమే అంతమ్మా! ఆడవాళ్ల కున్నలాంటి అతిమున్నితమైన భావాలు వాళ్లకు ఉండవు. విన్నా అర్థం కావమ్మా! వాళ్ల జీవితం, ఆ పరిధి— అంతా వేరు. ఎంతసేపూ వాళ్ల ఆనందం, వాళ్ల సంతోషం. దాని కోసమే వాళ్లేమయినా చేస్తారు. ఇది నేను ఒక్క మీ నాన్నగారి గురించే అనటం లేదమ్మా! ఆడదానితో స్నేహం, పరిచయం— వాళ్ల కెప్పుడూ ఒకే ఒక ప్రేమ, పెళ్లి—దీనివైపుకే పరుగెడతారు. అలాంటి వాటికోసమే వాళ్ల ఆలోచించేది, ఆచరించేది. తల్లితండ్రుల కోసం, తోబుట్టువుల కోసం ఆడపిల్ల ఆరాటపడేటట్లు మగవాడు ఆరాటపడడు. ఇది భగవంతుడు వాళ్ల కోసం సృష్టించిన ఇంత ప్రవృత్తి. మగవాళ్ల ఆలోచనలు ప్రేమ, పెళ్లి, భార్య, పిల్లలు, ఉద్యోగం, ఆస్తి, అంతస్తు, హోదా— వీటికి మించి ఇంకో విషయం గురించి ఆలోచించడానికి టైమ్ సరిపోదమ్మా! అతి మున్నితమైన అమరాగవస్సరి నా మాధవి స్నేహం బావ కెలా అర్థం అవుతుంది? అర్థం కాదు. అయినా, బావను ఒప్పించాలని నా కనిపించలేదు. ఆయన ఒక్కర్నీ మార్చి నే నేం చెయ్యగలను? నాకు సాధ్యమా? మాధవినే మార్చాలని, దానికి ఈ ప్రపంచపు పోకడ పూర్తిగా విడమరిచి చెప్పాలని అనుకున్నాను.

పాపా, మాధవీ! నా ప్రియ నెచ్చెలి మధు ఈ మా సంభాషణ అంతా వినేసింది. అక్కడినుండి గిరుక్కున వెళ్లిపోయింది. అదే కడసారి చూపు. హాస్పిటల్‌లో మరునాడు దానిని బ్రతికించాలని ఎంతో ప్రయత్నించారు డాక్టర్లు. కాని, సాధ్యపడలేదు. రెండే రెండు మాటలు వ్రాసింది మాధవి, చనిపోయే ముందు.

'వసూ! మనిషి అనుబంధం పరిస్థితుల దృష్ట్యా మాత్రమే పరిమితం కావాలి. ఒక మనిషిమీద ఏర్పడిన బంధంతో మిగతావాళ్ల దూరం కారు. అంతేకాదు. అభిమానం నటించడమెలాగో నాకు తెలియదు. పుట్టడమే ఒక మెంటల్ పేషెంటుగా పుట్టిన నేను, ఆ జబ్బుతోనే కన్ను మూశానని తృప్తి పడు.'

పాపా, మాధవీ! ఇదంతా నీకు ఎందుకు వ్రాశానో అర్థం చేసుకో! నా మాధవిలాగా నీవుకూడా నాకు దూరం కావద్దమ్మా! జీవితాన్ని, ప్రపంచాన్ని అర్థం చేసుకో. అందరిలాగానేమనమూను. ఒకే వ్యక్తి కోసం మిగతా అనుబంధాలు బలి పెట్టలేము. అంతేకాదు, అవతలి వాళ్లను శాసించకూడదు. ఆఖరున ఒక ప్రశ్న— నేను కళ్యాణిపట్ల ప్రేమగా ఉండి నిన్ను దూరం చేసుకున్నానని బాధ పడ్డావే! మరి నీ మనసులో నేను, నాన్న, కృష్ణ, శేఖర్, శాంతి, నీ ఫ్రెండ్ రాధ— ఇందరు ఉన్నారు కదా? వాళ్లందర్నీ దూరం చేసుకొని నన్నొక్కదాన్ని ఉంచుకోగలవా! !

జాగ్రత్తగా ఆలోచించు. అమ్మను క్షమించు.

ప్రేమతో...
—అమ్మ."

• • •

మర్నాడు ఉదయం నేను లేచేసరికే మాధవి లేచినట్లుంది. స్నానం చేసి బట్టలు మార్చుకున్నట్లుంది. రాత్రి దాని టేబిల్‌మీద ఉంచిన లెటర్ చదివే ఉండాలి. మెయిన్ హాల్లో ఉన్న వేణుగోపాలుడి విగ్రహం దగ్గర నిలుచుని, ఆ బొమ్మ కళ్లలోకి చూస్తూ ఉంది. దాని కళ్లలో నీటిపొర. మేడమెట్ల దగ్గర అలికిడికి వెనక్కి తిరిగింది. నన్ను చూసి ఏదో చెప్పబోయింది. చెప్పలేక కళ్లు వాల్చుకున్న అమాయకమైన దాని ముఖం చూస్తే నా మాధవే గుర్తుకు వచ్చింది. దగ్గరికి వచ్చి దాని నుదుటిమీద ముద్దు పెట్టుకున్నాను. అది నా గుండెల్లోకి ఒదిగిపోతూ—

"'అమ్మా, నన్ను క్షమించమ్మా! ఈ ప్రపంచపు పోకడ నాకు అర్థం అయిందమ్మా! అమ్మా! నీవు చెప్పిన సరికొత్త నిజాల్ని ఆచరిస్తానమ్మా! నీలాగానే నేనుకూడా డాక్టరునే అవుతానమ్మా! ఇంత కాలం నిన్ను, నీ బాధ్యతలని చూసి సుఖసంతోషాలకు దూరమైనావని అనుకొనేదాన్ని. కాని, అందులో ఏదో హాయి ఉందనిపిస్తూంది నాకు. . ."

నేనే అందుకున్నాను: "పిచ్చిమధూ! నీ కేమయుందమ్మా? నీ అభివృద్ధి కోసం అలమటించే నేను, మీ నాన్నగారు, నీ ఆత్మీయులు — వీళ్లంతా నీ చుట్టూ లేరూ! అయినా, మనలాంటి అనుభూతులకు అలమటించే వ్యక్తులకు, ఇంకొకరి కన్నీరు తుడవడానికి కారణం మనమేనని మనకు అనిపించే ఆ క్షణాలు ఎంత మధురమైనవి, తల్లీ! తప్పక నిన్ను డాక్టరు చదివిస్తాను. నీ అనురాగంతో రోగులనుబాధానివారితులుగాచేయమ్మా!" నా గుండెల్లో తల పెట్టుకుని వింటున్న మాధవిని, నన్ను చూస్తూ ఏమీ అర్థం కాక అప్పుడే లేచిన శ్రీవారు ఆశ్చర్యంగా నిలుచుండిపోయారు. ★


నాటకం
నటన
వినోదం

# రంగజ్యోతి

సచిత్ర మాస పత్రిక

5, సీతమ్మ రోడ్,
ఆళ్వార్‌పేట,
మద్రాసు - 18-
ఫోన్: 445365

నలభైసంవత్సరాలుగా వివిధ నాటక కార్యక్రమాలను నిర్వహించిన ప్రఖ్యాత నటులు

**డాక్టర్ చంద్రశేఖరం సంపాదకత్వాన**

ఈ నెలలో రాబోతున్నది.

* నాటకసంస్థలు, ప్రదర్శనాలు, నటన, హాల్సు—వీటిని గూర్చిన విషయాలు. * ప్రముఖుల అనుభవాలు, ఆలోచనలు.
* చంద్రశేఖరంగారికార్యక్రమాలవివరాలు. * హాస్యావళి.
* కార్టూన్స్. * ప్రతి సంచికలో రెండు ఏకాంకికలు.

ప్రతి నటుడు, నాటకాభిమాని, విద్యార్థి, విద్యార్థిని తప్పక చదవవలసిన పత్రిక. వెంటనే చందాదార్లుగా చేరండి.

సంవత్సర చందా రూ. 10/- మాత్రమే. విడి ప్రతి రూ. 1/-
ఏజంట్లకు 25% కమిషన్.